# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శుక్రవారం 5, సెప్టెంబర్ 2025


## విద్యారంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

★ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



బెల్లంపల్లి, సెప్టెంబర్ 04, ప్రభాతవార్త

ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ విద్యారంగ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని తాండూర్ మండలం తంగళ్ళపల్లి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో షెడ్యూల్డ్ తెగల సంక్షేమ వసతి గృహ ఏర్పాటు కొరకు మండల తహసిల్దార్ జ్యోత్స్నతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం విద్య వ్యవస్థ అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సౌకర్యార్థం అన్ని సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో తాండూర్ మండలం తంగళ్ళపల్లి గ్రామంలో ఎస్.టి. సంక్షేమ వసతి గృహాన్ని ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని పరిశీలించడం జరిగిందని తెలిపారు. అనంతరం తాండూర్ మండల కేంద్రంలో వినాయక నిమజ్జనానికి పెద్ద చెరువు ప్రాంతంలో జరుగుతున్న ఏర్పాట్లను రామగుండం మిగతా 2లో..



## ఈవీఎంల భద్రత దిశగా పటిష్టమైన చర్యలు

✻ మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, సెప్టెంబర్ 04, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లాలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రత దిశగా పటిష్టమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం సాధారణ తనిఖీలలో భాగంగా జిల్లాలోని నస్పూర్ లో గల ఈ.వి.ఎం. గోదామును జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఈ.వి.ఎం. గోదాము వద్ద భద్రత సిబ్బందితో పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, సి. సి. కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రామచందర్, సంబంధిత అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిలో నాలుగు గనులకు జాతీయస్థాయి ఫైవ్‌స్టార్ రేటింగ్ అవార్డులు




● కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి చేతుల మీదుగా స్వీకరించిన సింగరేణి సీఎండీ ఎన్.బలరాం

నస్పూర్, సెప్టెంబర్ 04, ప్రభాతవార్త

పర్యావరణ హిత చర్యలు, సంక్షేమం, సౌకర్యాల కల్పనలో ఉత్తమ కంపెనీగా ఉన్న సింగరేణి సంస్థ గత ఆర్థిక సంవత్సరానికి జాతీయస్థాయిలో 4 బొగ్గు గనులకు ఫైవ్ స్టార్ రేటింగ్‌ను సాధించి తన ప్రతిభను మరోసారి చాటుకుంది. గురువారం ముంబయిలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి చేతుల మీదుగా సింగరేణి సంస్థ సీఎండీ ఎన్. బలరామ్ ఈ అవార్డులను అందుకున్నారు. ప్రతిష్టాత్మక ఫైవ్ స్టార్ రేటింగ్ అవార్డులను అందుకున్న గనులలో రామగుండం3 ఏరియాకి చెందిన ఆర్‌జి ఓసి1 ఎక్స్ టెన్షన్, ఇల్లందు ఏరియాకి చెందిన జె కే5 ఓసి, భూగర్భగనుల్లో శ్రీరాంపూర్ ఏరియాకి చెందిన ఆర్.కె6 గని, ఆర్.కె న్యూటెక్ గనులు ఉన్నాయి. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ వారు ప్రతీ ఏడాది దేశంలో అత్యుత్తమ గనులకు స్టార్ రేటింగ్‌ను ఇస్తూ అత్యుత్తమ స్టార్ రేటు సాధించిన గనుల యాజమాన్యాలను అభినందిస్తూ అవార్డులను అందిస్తూ ఉంటారు. ఈ ప్రక్రియను స్టార్ రేటింగ్ అంటారు. ఇలా స్టార్ రేటింగ్ ఇవ్వడం కోసం బొగ్గు గని పనితీరు, రక్షణ చర్యలు, నిర్వహణ, అక్కడ గల సౌకర్యాలు, పర్యావరణహిత చర్యలు, కార్మిక సంక్షేమం వంటి 84 అంశాలను పరిగణనలోనికి తీసుకుని మార్కులను మిగతా 2లో..

## పండుగలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి

✻ మంచిర్యాల, జైపూర్ ఏసీపీలు ప్రకాష్, వెంకటేశ్వర్లు



నస్పూర్, సెప్టెంబర్ 04, ప్రభాతవార్త

పండుగలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని వంద ఫీట్ల రోడ్డులో అంజనీ పుత్ర రియల్ ఎస్టేట్స్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారిని అంజనీ పుత్ర సంస్థ చైర్మెన్ గుర్రాల శ్రీధర్, మేనేజింగ్ డైరెక్టర్ పిల్లి రవి ఘనంగా సన్మానించి జ్ఞాపికలను మిగతా 2లో..



## అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలి

★ జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్

ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో (ప్రభాతవార్త)

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ గురువారం ఆసిఫాబాద్ పట్టణంలోని పెద్ద వాగు మరియు కాగజ్నగర్ పెద్దవాగు వద్ద గణేష్ నిమర్జనం ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.ఎస్పీ మాట్లాడుతూ,... జిల్లాలో గణేష్ నిమర్జనం ఉత్సవాలు అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీగా, ప్రశాం తంగా, భద్రతా చర్యలతో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.జిల్లాలోని వివిధ నిమర్జన ఘాట్‌ల వద్ద, ట్రాఫిక్ మరియు ఇతర డ్యూటీల కోసం మొత్తం 600 మంది పోలీస్ సిబ్బందిని బందోబస్తు కోసం నియమించినట్లు చెప్పారు. నిమర్జన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, బోట్స్, రోప్స్, డీడీఆర్ఎఫ్ బృందం, ఈతగాళ్లు అందుబాటులో ఉంచనునట్లు వివరించారు.నిమర్జనం శోభాయాత్రలు సాఫీగా సాగేందుకు ట్రాఫిక్ పరంగా కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.నిమర్జన ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో ఆనందంగా జరుపుకోవాలని, మద్యం సేవించి సంస్కృుతి, సాంప్రదాయాలు నాశనం చేసుకోవద్దని అన్నారు. గణేష్ మండప నిర్వాహకులు, భక్తులు విద్యుత్ పట్ల ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని మిగతా 2లో..

# వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని శాంతియుతంగా జరుపుకోవాలి

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**నస్పూర్, సెప్టెంబర్ 04, ప్రభాతవార్త**

వినాయక నవరాత్రుల అనంతరం శోభయాత్ర నిర్వహించి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రజలందరూ సమన్వయంతో శాంతియుతంగా జరుపుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని మంచిర్యాల పట్టణంలో వినాయక నిమజ్జన కార్యక్రమంలో భాగంగా శోభయాత్ర నిర్వహించే రూట్ మాప్, ఇతర ఏర్పాట్లను రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా, డి.సి.పి. ఎ. భాస్కర్, మంచిర్యాల ఎ.సి.పి. ప్రకాష్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గణేష్ శోభాయాత్ర కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సంబంధిత శాఖల సమన్వయంతో రూట్ మ్యాప్ రూపొందించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన గణేష్ మండళ్ల వివరాలను నమోదు చేయడం జరిగిందని, తదనగుణంగా రూపొందించిన రూట్ మ్యాప్ ను ఆయా మండళ్ల నిర్వాహకులు అనుసరించాలని తెలిపారు. నిమజ్జన ప్రదేశాలలో విద్యుత్, మత్స్యశాఖ, పోలీస్, రెవెన్యూ సంబంధిత శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా జరిగే విధంగా సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి మార్గదర్శకాలు జారీ చేయడం జరిగిందని, భద్రత దృష్ట్యా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం, నిమజ్జన ప్రదేశాలలో క్రేన్, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. అనంతరం రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్, మంచిర్యాల డిసిపి, జైపూర్ ఎసిపి వెంకటేశ్వర్లులతో కలిసి జైపూర్ మండలం ఇందారం సమీపంలోని గోదావరి వంతెన పై నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. ప్రజల రవాణాకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. వినాయక శోభయాత్ర, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా సంబంధిత అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జనావాసాల్లోకి చుక్కల దుప్పి

**వేమనపల్లి, సెప్టెంబర్ 4, ప్రభాత వార్త**

వేమనపల్లి మండలం నీల్వాయి ఫారెస్ట్ పరిధి అటవీలో తిరుగుతున్న చుక్కల దుప్పి గురువారం ఉదయం దారితప్పి కల్మలపేట గ్రామ జనావాసాల మధ్యకు చేరింది. చెంగు చెంగున ఎగురుతూ కాసేపు వీధుల వెంట సందడి చేసింది. గమనించిన స్థానికులు అటవీ అధికారులకు సమాచారం అందించడంతో అటవీ సిబ్బంది చేరుకొని గ్రామస్థుల సహకారంతో దుప్పికి ఎటువంటి హాని జరగకుండా క్షేమంగా అటవీ ప్రాంతంలోకి పంపించినట్లు నీల్వాయి అటవీ రేంజ్ అధికారి హాఫీజోద్దీన్ తెలిపారు. వన్యప్రాణులకు ఎటువంటి హాని చేయకూడదని గ్రామ ప్రజలకు సూచించారు. వీరితో అటవి బీట్ అధికారీ మహిపాల్, సిబ్బంది ఉన్నారు.





## వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

**వేమనపల్లి, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త**

వేమనపల్లి మండల కేంద్రంలో గణేష్ నవరాత్రుల సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కోళి వేణుమాధవ్ రావు ఆధ్వర్యంలో వేమన యూత్ గణేష్ మండలి వద్ద వాలీబాల్ టోర్నమెంట్‌ను గురువారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ కుబిడే వెంకటేష్, స్థానిక మాజీ సర్పంచ్ కుబిడే మధుకర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సుంపుటం మాజీ సర్పంచ్ కొండగొర్ల బాపు, గ్రామ అధ్యక్షులు వెలిశాల రమేష్, గుమ్మెల సత్యం, కొండయ్య, పోశెట్టి, శ్రీకాంత్ క్రీడాకారులు పాల్గొన్నారు.

# సింగరేణిలోని నాలుగు గనులకు జాతీయస్థాయిలో ఫైవ్ స్టార్ రేటింగ్ అవార్డులు

(మొదటిపేజీ తరువాయి)

కేటాయించడం జరుగుతుంది. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రమాణాలు నెలకొల్పి ఉన్న గనులలో పై 84 అంశాలను కేంద్ర బొగ్గు శాఖ నుండి వచ్చిన పరిశీలక బృందం వారు ప్రత్యక్షంగా పరిశీలించి మూల్యాంకనం జరుపుతారు. ప్రాథమిక మూల్యాంకనం తర్వాత వీటి నుండి అత్యుత్తమ గనులను ఎంపిక చేస్తారు. ఇలా ఎంపిక చేసిన వాటిలో ఇంకా అత్యుత్తమమైన వాటిని మరో కమిటీ ద్వారా ఎంపిక చేయడం జరుగుతుంది. మొత్తం 100 మార్కుల్లో 91 కన్నా ఎక్కువ మార్కులు సాధించిన గనులకు ఫైవ్ స్టార్ రేటింగ్ ఇస్తారు. ఈ విధంగా సింగరేణి సంస్థలో ఈసారి నాలుగు గనులు ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించడం అభినందనీయం. ఈ గనుల నిర్వహణ, పర్యావరణ చర్యలు, సంక్షేమ కార్యక్రమాలు, ఉత్పత్తి సాంకేతికత వంటి అంశాలలో ఉత్తమ ప్రమాణాలు పాటిస్తున్నందు వల్లే ఈ అవార్డులు సాధించుకోవడం జరిగింది. దీనిపై సీఎండీ ఎన్. బలరామ్ తన హర్షం ప్రకటిస్తూ గనుల యాజమాన్యాలకు, కార్మికులకు తన అభినందనలు తెలియజేశారు. ఈ ఏడాది గతంలో ఎప్పుడూ లేని విధంగా నాలుగు గనులకు 5 స్టార్ రేటింగ్ లభించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇవే కాకుండా 14 గనులు 100 కు 80 నుండి 90 మార్కులు సాధించి 4 స్టార్ రేటింగు ను అందుకోవటం విశేషం. 20 గనులకు 3 స్టార్ రేటింగ్ లభించడం విశేషం. గతంలో కొన్ని గనులకు 2 స్టార్ రేటింగ్లు కూడా లభించగా. ఈ సారి అన్ని గనులు కూడా తమ పనితీరును మెరుగుపరచుకుని 3 స్టార్ రేటింగ్ సాధించడం విశేషం. ఈ వేడుకలలో శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ ఎం. శ్రీనివాస్, ఆర్.కె 5,6 గ్రూప్ ఏజెంట్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

(మొదటిపేజీ తరువాయి)

కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా, డి.సి.పి. ఎ.భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, తహసిల్దార్ జ్యోత్స్న, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ లతో కలిసి పరిశీలించారు. వినాయక శోభాయాత్ర అనంతరం నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. నిమజ్జనం ప్రాంతంలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. తాండూర్ మండల కేంద్రంలోని ఐ.బి. ప్రాంతంలో ఏర్పాటు చేసిన శ్రీ గణేష్ మండలిని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. నిమజ్జన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని, నిమజ్జన ప్రాంతంలో లైట్లు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేశామని తెలిపారు. మండలంలో ఏర్పాటు చేసిన వినాయక మండళ్లు రిజిస్ట్రేషన్ అయిన ప్రకా రం ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులకు తావు లేకుండా రూట్ మ్యాప్ సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. మండళ్ల నిర్వాహకులు మార్గదర్శకాలను పాటిస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

సూచించారు. నిమజ్జనం శోభాయాత్రలో గాని, నిమర్జన ప్రాంతాల్లో గాని ఎటువంటి సమస్యలు ఎదురైనా వెంటనే పోలీసులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఇన్స్పెక్టర్ బాలాజీ వరప్రసాద్, ఎస్సై ఉదయ్ కిరణ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పండుగలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా పండుగలు ఆధ్యాత్మికంగా, శాంతియుత మార్గంలో నిర్వహించుకోవాలని అన్నారు. ఐక్యతతో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా వినాయక చవితి నవరాత్రోత్సవాలను, నిమజ్జనోత్సవాన్ని నిర్వహించుకోవాలన్నారు. అనంతరం అంజనీ పుత్ర సంస్థ చైర్మెన్ గుర్రాల శ్రీధర్, మేనేజింగ్ డైరెక్టర్ పిల్లి రవి మాట్లాడుతూ, సామాజిక సేవలో ఆంజనేపుత్ర ఎల్లప్పుడూ ముందుంటుదన్నారు. ఈ కార్యక్రమంలో ఆంజనీ పుత్ర సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌లు సూరినేని కిషన్, కాసర్ల సదానందం డైరెక్టర్‌లు, స్థానిక సీఐ, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**కాగజ్‌నగర్, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త:**

కాగజ్ నగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్.ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ తూడూరు దత్తాత్రేయ ఆధ్వర్యంలో గురువారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి, స్టాఫ్ సభ్యులు భారత దేశ ప్రఖ్యాత తాత్వికుడు, మాజి రాష్ట్రపతి డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా విద్యార్థులు ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల టీచింగ్ స్టాఫ్‌ను విద్యార్థులు గౌరవంగా సత్కరించగా, నాన్‌టీచింగ్ స్టాఫ్ ఆధ్వర్యంలో టీచింగ్ స్టాఫ్‌కు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని, కళాశాల పేరు ప్రతిష్టలను మరింత పెంచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మినరసింహం, కళాశాల కోఆర్డినేటర్ దుర్గం జనార్ధన్, టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## వినాయక నిమజ్జనంపై
# పోలీసుల సూచనలు

**రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త**




వినాయక నిమజ్జనం శాంతియుతంగా, భద్రంగా జరిగేలా ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ ఎస్సై రాజశేఖర్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిమజ్జన కేంద్రాల్లోనే విగ్రహాలను నిమజ్జనం చేయాలని, అనుమతి లేని ప్రదేశాల్లో లేదా లోతైన నీటిలో నిమజ్జనం చేయరాదని ఆయన స్పష్టం చేశారు. శోభాయాత్రలకు ఉపయోగించే వాహనాలు సక్రమంగా ఉండాలని, డ్రైవర్లు మద్యం సేవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఊరేగింపుల్లో డీజేలకు అనుమతి లేదని, బాణాసంచా కాల్చడం నిషేధమని ఎస్సై రాజశేఖర్ హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని తెలిపారు. నిమజ్జనం కోసం వెళ్లే దారిలో ట్రాఫిక్ నియమాలు పాటించాలని, మద్యం సేవించి నిమజ్జనానికి వచ్చే వారిని గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రమాదంలో ఎవరైనా చిక్కుకున్నా 100 నంబర్ లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గుంపులు ఎక్కువగా కూడవద్దని, చిన్నపిల్లలు, వృద్ధులు తప్పిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వినాయక నిమజ్జనం సందర్భంగా భక్తి, భద్రత, పర్యావరణ పరిరక్షణను సమానంగా కాపాడాలని ఎస్సై రాజశేఖర్ ప్రజలకు పిలుపునిచ్చారు.

## గ్రామపంచాయతీ కార్మికుల
# మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి

### ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్

**రెబ్బెన, సెప్టెంబర్ 4, ప్రభాత వార్త**

గ్రామ పంచాయితీ కార్మికుల మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేసి జీవో 60 నెంబర్ ప్రకారం వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. గురువారం రోజున గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రెబ్బెన మండల అధ్యక్షులు రాచకొండ రమేష్ అధ్యక్షతన రెబ్బెన ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ధర్నా అనంతరం ఆఫీస్ సూపర్డెంట్ వాసు కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది అనంతరం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని అన్ని గ్రామపంచాయితీల్లో సుమారు 4 నుండి 6 నెలలుగా వేతనాలు లేక కార్మికులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రంలో 2023 జులై, ఆగస్టు నెలలో కార్మికుల వేతనాలు ఇతర సమస్యల పరిష్కారం కోసం 34 రోజుల పాటు నిరవధిక సమ్మె చేయటం జరిగింది. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం కార్మిక సంఘాలన్నింటిని చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వటంతో నాడు సమ్మె విరమించటం జరిగింది. ఈ సందర్భంగా కార్మికులందరికి జీవిత బీమా సౌకర్యం 5 లక్షలు కానీ నేటికి అనేక జిల్లాల్లో జీవిత బీమా సౌకర్యం కల్పించకపోవటంతో జిల్లాల్లోని అనేక ప్రాంతాల్లో ట్రాక్టర్ మరియు ఇతర ప్రమాదాల్లో కార్మికులు మరణించటం జరిగింది. కానీ వారికి ప్రభుత్వం నుండి ఎటువంటి బీమా సౌకర్యం అందలేదు. అదే విధంగా కార్మికులందరికి 1వ పే కమీషన్ నిర్ణయించిన మినిమమ్ బేసిక్ వేతనాన్ని కొనసాగించాలని, జి.ఓ.నెం.51 సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేసి పాత కెటగిరీలన్నింటిని యధావిధిగా అమలు చేయాలని, ప్రమాదంలో మరణించి కార్మికుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉ ద్యోగం ఇవ్వాలని, సహజ మరణానికి కూడా 5 లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేయాలని, కార్మికులందరికి ఇయస్ఐ, పిఎఫ్, వారాంతపు, పండుగ, జాతీయ, ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని, 2011 జనాభా లెక్కల ప్రకారం కాకుండా గ్రామ పంచాయితీ అవసర ప్రాతిపదికన కార్మికులను నియమించుకోవాలని, ట్రాక్టర్ డ్రైవర్లందరికి పంచాయితీల ద్వారానే డ్రైవింగ్ లైసెన్సు ఇప్పించాలని, సంవత్సరానికి 3 జతల యూనిఫాం, సరిపడ చెప్పులు, సబ్బులు, నూనెలు ఇవ్వాలని, కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రెబ్బెన మండల అధ్యక్షుడు రాచకొండ రమేష్ కార్యదర్శి రత్నం దేవాజి, ఉపాధ్యక్షులు వెంకటేష్,శ్రీనివాస్, శంకర్, కార్మికులు సత్తయ్య, అన్నజీ,మల్లేష్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.



మండల పరిషత్ సూపరిండెంట్ కు వినతి పత్రాన్ని ఇస్తున్న దృశ్యం

# ఉపాధ్యాయుల సేవకు ఘన సత్కారం

**రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 04, ప్రభాతవార్త**

స్థానిక ఎస్ఆర్కే ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భారతదేశ రెండవ రాష్ట్రపతి, తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ప్రతి ఏటా జరుపుకునే ఈ వేడుకలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 9, 10వ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలో తరగతులు నిర్వహించారు. డాక్టర్ రాధాకృష్ణ సేవాభావం, ఆయన విద్యారంగానికి చేసిన కృషిని గుర్తుచేసుకున్నారు. రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన ఆయన జీవితం అందరికీ ఆదర్శమని, ఆయన చూపిన మార్గంలో నడుస్తూ దేశాభ్యున్నతికి కృషి చేస్తామని విద్యార్థులు సంకల్పం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు. విద్యార్థి–ఉపాధ్యాయులందరికీ బహుమతులు అందజేశారు. విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు ఎల్లప్పుడూ కృషి చేయాలని ప్రధానోపాధ్యాయులు ఉప్పలయ్య ఆకాంక్షించారు. విద్యార్థుల వినోదాత్మక, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలో పాఠశాల డైరెక్టర్ కోల శ్రీనివాసు, ఉపాధ్యాయులు డోకూరి సోమశేఖర్, అంబాల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న దృశ్యం




## యోగా పోటీలల్లో
# ప్రతిభ కనబరచాలి

**రెబ్బెన, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త**

రాష్ట్ర ఆరవ స్థాయి నిర్మల్ లో జరగనున్నటువంటి యోగ పోటీలలో పాల్గొని పథకాలు సాధించాలని కేసరి ఆంజనేయులు గౌడ్ కొమరం భీమ్ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు తెలిపారు.తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 6వ తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ ,జూనియర్ ఛాంపియన్‌షిప్ (బాలురు, బాలికలు 2025-26) నిర్మల్ జిల్లా కేంద్రం దివ్య గార్డెన్ లో ఈనెల 5 నుండి 7 సెప్టెంబర్ 2025 వరకు జరుగు రాసస్థాయి పోటీల లో కుమురం భీమ్ జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ నుండి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నిర్మల్ కు బయలుదేరిన విద్యార్థిని విద్యార్థులు యోగ క్రీడా విభాగాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పథకాలు సాధించాలని కొమరం భీమ్ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కేసరి ఆంజనేయులు గౌడ్. ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏడుకొండలు. టీం మేనేజర్ కుమ్మరి మల్లేష్ అన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో
# ఘనంగా ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమం

**కాగజ్‌నగర్, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త:**

కాగజ్ నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఓల్డ్), లో ప్రధానోపాధ్యాయులు జాడి దేవాజి అధ్యక్షతన ఏక్ పేడ్ మా కే నామ్ పేరుతో ఒక వినూత్న పర్యావరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కోట ప్రసాద్ హాజరై, విద్యార్థులకు మొక్కల యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, ప్రకృతిని రక్షి ంచాల్సిన బాధ్యతను సూచించారు. అలాగే తల్లుల గౌరవాన్ని, వారు సమాజంలో ఉన్న స్థానాన్ని గుర్తుచేశారు. విద్యార్థులు తల్లుల పేరుతో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థినీ, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యార్థులకు తల్లిదండ్రుల పట్ల ప్రేమ, గౌరవం పెంపొందించడంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులలో పర్యావరణ పరిరక్షణ కుటుంబ విలువల పట్ల అవగాహన పెంచే దిశగా మైలురాయిగా నిలుస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు.





### ఆర్.కె 5 గని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను

# తక్షణమే పరిష్కరించాలి

**- ఐఎన్టీయూసీ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జెట్టి శంకర్ రావు**

నస్పూర్, సెప్టెంబర్ 04, ప్రభాతవార్త

ఆర్.కె 5 గని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఐఎన్టీయూసీ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జెట్టి శంకర్ రావు అన్నారు. గురువారం బాయి బాట కార్యక్రమంలో భాగంగా ఐఎన్టీయూసీ నాయకులు మొదటి షిఫ్ట్‌లో కార్మికులను కలిసి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఐఎన్టీయూసీ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జెట్టి శంకర్ రావు మాట్లాడుతూ, బ్యాంక్ హెడ్ పై కొత్త రూఫ్ షీట్స్ ఏర్పాటు చేయాలని, ప్రాంగణంలో డ్రైనేజ్ సదుపాయం కల్పించి రెగ్యులర్ క్లీనింగ్ నిర్వహించాలని, 21 లెవెల్ 5 సిమ్ వద్ద వెంటనే గాలి సరఫరా చర్యలు తీసుకోవాలని, గనిలో ట్రాక్ లైన్ల క్లీనింగ్, మరమ్మతులను వెంటనే చేపట్టి, ప్రమాదాలు నివారించడంతో పాటు ప్రొడక్షన్ పెంపుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై గని అధికారులు సానుకూలంగా స్పందించి, సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ కేంద్ర నాయకులు గరిగ స్వామి, తిరుపతి రాజు, పేరం రమేష్, జీవన్ జోయల్, మల్లారెడ్డి, శ్రీనివాసరావు, పిట్ కార్యదర్శి నంబయ్య, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి మోతే రవి రాజేందర్, నాయకులు మహేందర్ రెడ్డి, పెద్దిరాజు, శ్రీధర్ల మల్లేష్, యాదగిరి, సంతోష్, నరేష్, మచ్చ రమేష్, సిద్ధి లింగయ్య, రవితేజ తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ మాల మహానాడు మంచిర్యాల నియోజకవర్గ ఇన్‌ఛార్జీగా గరిసె రామస్వామి

నస్పూర్, సెప్టెంబర్ 04, ప్రభాతవార్త

జాతీయ మాల మహానాడు మంచిర్యాల నియోజకవర్గ ఇన్చార్జిగా నస్పూర్ పట్టణానికి చెందిన గరిసె రామస్వామి నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గరిసె రామస్వామి మాట్లాడుతూ, తనపై నమ్మకంతో మంచిర్యాల నియోజకవర్గ ఇన్చార్జిగా అవకాశం కల్పించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ కు ధన్యవాదాలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని, జాతీయ మాల మహానాడు పురోభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

## ప్రియాంష్ విద్యకు అండగా తవక్కల్ సంస్థ

రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 04, ప్రభాతవార్త:



పట్టణంలోని శ్రీనివాస నగర్‌కు చెందిన నవీన్ (కంప్యూటర్ ఆపరేటర్) నిన్న సాయంత్రం వ్యక్తిగత కారణాల వల్ల ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన గత రెండు నెలలుగా తవక్కల్ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ ఘటన తెలిసిన తవక్కల్ విద్యా సంస్థల అధినేత అబ్దుల్ అజీజ్ మృతుని ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవీన్ మరణం కుటుంబానికి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. అలాగే, ప్రస్తుతం తవక్కల్ పాఠశాలలో 2వ తరగతి చదువుతున్న నవీన్ కుమారుడు ప్రియాంష్‌కు పదవ తరగతి వరకు ఉచిత విద్యను కల్పించడంతో పాటు, అవసరమైతే ఉన్నత విద్యకు కూడా సహకరించనున్నట్టు హామీ ఇచ్చారు.

### రెసిడెన్షియల్, మైనారిటీ ఆశ్రమ పాఠశాలల్లో

# వైద్య శిబిరాల ఏర్పాటు

బెల్లంపల్లి, సెప్టెంబర్ 04, (ప్రభాతవార్త):




ఆరోగ్య శిబిరంలో పాల్గొన్న వైద్యాధికారులు, విద్యార్థులు

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఎస్ అనిత ఆదేశానుసారం బెల్లంపల్లి గురుకుల మైనార్టీ గర్ల్స్ రెసిడెన్షియల్ పాఠశాలలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ వైద్య శిబిరంలో 212 మందికి పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఇందులో 15 మంది విద్యార్థులకు జ్వరాలుగా గుర్తించి పరీక్షలు చేయించడం జరిగింది. మలేరియా డెంగ్యూ ఎలాంటి పాజిటివ్ కేసులో నిర్ధారణ కాలేదు. అదేవిధంగా చర్మ సంబంధిత 8 మంది విద్యార్థులు, కంటికి సంబంధించిన ఇద్దరు విద్యార్థులు ఇతర సమస్యలతో 24 మందిని గుర్తించి వైద్య శిబిరంలో చికిత్స అందించడం జరిగింది. అనంతరం పాఠశాలలో దోమల మందు పిచికారి చేయించడం జరిగింది. ఈ పాఠశాలలో వైద్యాధికారుడు మూడు రోజులపాటు వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తెలియజేశారు. పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్టు బుక్క వెంకటేశ్వర్ జిల్లా మాస్ మీడియా అధికారి తెలియజేశారు. అదేవిధంగా జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులందరూ తమ పరిధిలోని రెసిడెన్షియల్ పాఠశాలలో వైద్య శిబిరంలో ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుచరిత, ఆర్ బి ఎస్ కే సిబ్బంది పద్మ, డి పి హెచ్ ఎన్, వైద్య సిబ్బంది మరియు ఆర్బిఎస్ వైద్యులు, ఆశ ఆరోగ్య కార్యకర్తలు పాఠశాలకు సంబంధించిన ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# బోరుకు కొత్త మోటారు ఏర్పాటు

వేమనపల్లి, సెప్టెంబర్ 4(ప్రభాత వార్త)



మండలంలోని గొర్లపల్లి గ్రామంలో గుడి సమీపంలో బోర్ లో మోటర్ చెడిపోవడం వలన అక్కడి కాలనీ వాసులు త్రాగు నీరు కొరకు ఇబ్బందులు పడుతుండగా సమస్యను తెలుసుకున్న మాజీ జడ్పీటీసీ ఆర్.సంతోష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ సాబీర్ అలీ లు ఎమ్మెల్యే నిధుల నుండి కొత్త మోటర్‌ను ఏర్పాటు చేయించారు. దీంతో నీటి సమస్య తీరిపోవడంతో కాలని వాసులు కృతజ్ఞతలు తెలిపారు. వీరితో మాజీ సర్పంచ్ గాలి మధు, మోర్ల రమేష్, ఇగురం జగన్, మాజీ ఎంపీటీసీ అదే శంకర్ నాయకులు పాల్గొన్నారు.

# మరణించినా.. జీవిస్తున్న డోలి కృష్ణమూర్తి

**- నేత్రదానంతో ఇద్దరు అందుల జీవితంలో వెలుగులు**

బెల్లంపల్లి, సెప్టెంబర్ 04, ప్రభాతవార్త



బెల్లంపల్లి పట్టణం హనుమాన్ బస్తి వాస్తవ్యులు డోలి కృష్ణమూర్తి ఈ రోజున ఉదయం సికింద్రాబాద్ బృందావన్ కాలనీలో అనారోగ్యంతో మరణించగా జనహిత సభ్యులు డోలి సుకుమార్ వారి కుటుంబ సభ్యులకు నేత్రదానం కొరకు వివరించగా వారి కుటుంబ సభ్యులు భార్య డోలి పుష్ప, కుమారులు నాగేంద్ర ప్రసాద్, సాయికృష్ణ పుట్టెడు దుఃఖంలోను నేత్రదానం ద్వారా ఇద్దరు జీవితాల్లో వెలుగులు నింపాలని భావించి నేత్రదానంకు అంగీకరించడంతో డోలి సుధీర్ పర్యవేక్షణలో సదశయా ఫౌండేషన్ వారి సహకారంతో వాసన్ ఐ బ్యాంక్ సిబ్బంది నేత్రాలని స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ నేత్రదాత డోలి కృష్ణమూర్తి కుటుంబ సభ్యులకు, సభ్యులు డోలి సుకుమార్ మరియు డోలి సుధీర్‌లని అభినందిస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు.